స్థానిక సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

రసూల్‌పురా: టీచర్స్‌కాలనీ చిన్న కమేలా బస్తీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ హామీచ్చారు. శుక్రవారం కంటోన్మెంట్‌ నియోజకవర్గంలోని 7వవార్డు టీచర్స్‌ కాలనీ, చిన్న కమేలా బస్తీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా టీచర్స్‌కాలనీ వాసులతో మాట్లాడుతూ స్థానికంగా ఉన్న పార్కులో పవర్‌బోర్‌ వెల్‌ బిల్లు మూడేళ్ళ నుంచి బోర్డు అధికారులు చెల్లించడం లేదన్నారు. గన్‌రాక్‌ కమ్యూనిటీహాల్‌లో శానిటేషన్‌ కార్యాలయం ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే బోర్డు అధికారులకు, విద్యుత్‌ విభాగం అధికారులకు ఫోన్‌ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాక్రమంలో టీచర్స్‌కాలనీ అధ్యక్షులు బిక్షపతిరెడ్డి, ప్రభాకర్‌ రెడ్డి, అర్విండ్‌ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం



చెత్త సేకరణ వీల్‌ బారో ఫ్రేమ్‌లను కార్మికులకు అందజేస్తున్న కార్పొరేటర్‌ ప్రసన్న

అడ్డగుట్ట: పరిసరాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని కార్పొరేటర్‌ ప్రసన్నలక్ష్మి అన్నారు. శుక్రవారం తుకారాంగేట్‌లోని వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణ వీల్‌ బారో ఫ్రేమ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంలో భాగంగానే వీల్‌ బారో ఫ్రేమ్‌లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్‌ సౌజన్య పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకండి



తలసానికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న అమీర్‌పేట హనుమాన్‌ దేవస్థానం ఈఓ జయంతి తదితరులు

సనత్‌నగర్‌: వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీరకు నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అమీర్‌పేట హనుమాన్‌ దేవస్థానం ఈఓ జయంతి, మాజీ కార్పొరేటర్‌ శేషుకుమారి, ఆలయ పండితులు శుక్రవారం ఆహ్వానం అందించారు. వెస్ట్‌ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ముందుగా ఆలయ పండితులు ప్రసాదాలను అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు.

ఓయూలో బహుజన బతుకమ్మ సంబరాలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బహుజన బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం పీడీఎస్‌యూ (విజృంభణ) ఆధ్వర్యంలో జరిగిన బహుజన బతుకమ్మ ఉత్సవాలకు అరుణోదయ విమలక్క ముఖ్యఅతిథిగా హాజరై ఆట, పాటలతో సందడి చేశారు. మహిళల పై జరుగుతున్న హత్యాచారాలు, దౌర్జన్యాల పై ఈ సందర్భంగా విమలక్క ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్‌, రమ్యశ్రీ, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

కంటోన్మెంట్‌: ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు కలిగి ఉన్న భారతీయ జనతాపార్టీకి రోజు రోజుకూ మరింత ఆదరణ పెరుగుతోందని కంటోన్మెంట్‌ బోర్డు నామినేటెడ్‌ సభ్యుడు రామకృష్ణ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి శుక్రవారం ఐదోవార్డు బీజేపీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ క్రియాశీలక కార్యకర్త కనీసం వందమందితో సభ్యత్వం చేయించాలన్నారు. అప్పుడే పార్టీ బలోపేతం అవ్వడంతో పాటు ఏ ఎన్నికైన సునాయసంగా గెలవగలమని అన్నారు. కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్‌ సభ్యత్వ నమోదు జిల్లా కో కన్వీనర్‌ సతీష్‌, బిజెపి నాయకులు డా.వంశ తిలక్‌, వార్డ్‌ 5 అధ్యక్షులు విజయ్‌ యాదవ్‌, కార్యకర్తలు, బూత్‌ అధ్యక్షులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ దాడి బీజేపీ కుట్ర

లాలాపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలో భాగంగానే తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై ఈడీ దాడులు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి నవనిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నరేష్‌ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి చెడ్డ పేరు లేకుండా మంచి వ్యాపార వేత్తగా పేరున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై ఈడి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌ పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వం నాయకులను భయపెట్టడానికి, వారి మానసిక స్థైరాన్ని దెబ్బకొట్టడానికి చేస్తున్న ఈ ప్రయత్నాలను వెంటనే ఆపాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బన్సీలాల్‌పేట్‌: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం గాంధీనగర్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలోని బోలక్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ రాజు కథనం ప్రకారం...భోలక్‌పూర్‌ మేకలమండి ప్రాంతంలో త్రీకార్డ్స్‌ ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడిచేశారు. పేకాట ఆడుతున్న సాయికుమార్‌, ఆకాష్‌, వెంకటేష్‌, సాయిప్రసాద్‌, చరణ్‌, వెంకటేష్‌, పవన్‌కుమార్‌, ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ. 6,810 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

చిన్న కాలనీ.. పెద్ద ఆశయం

పచ్చదనంపై మోడల్‌కాలనీ ప్రత్యేక దృష్టి

సనత్‌నగర్‌: కాలనీ చిన్నదే..కానీ వారి ఆశయం గొప్పది. భావి తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించాలన్నదే వారి సంకల్పం. అందుకే మొక్క మొక్కనూ ప్రాణంతో సరి సమానంగా చూసుకుంటూ పచ్చదనాన్ని పరిఢవిల్లేలా చేస్తున్నారు. ఒక్కసారి ఆ పార్కును సందర్శిస్తే మాత్రం పచ్చదనపు పరవళ్ల నడుమ పరవశం కావాల్సిందే మరి. ఆ పార్కు సోయగాల వెనుక ఒకటి..రెండు..మూడేళ్లు కాదు..దశాబ్దాల కృషి దాగి ఉంది. జీహెచ్‌ఎంసీ గానీ, హెచ్‌ఎండీఏ గానీ మరేయితర ప్రభుత్వ రంగ సంస్థలు గానీ గ్రీనరీ అవార్డులకు ఎంట్రీలు తెరిస్తే చాలు..ఈ పార్కుకు అవార్డు ఖాయమే. ఈ పార్కు నిర్వహణకు దక్కిన అవార్డులే ఇందుకు నిదర్శనం. ఇదీ ఈఎస్‌ఐ సమీపంలో ఉన్న మోడల్‌కాలనీ పార్కు ప్రత్యేకత. పచ్చదనం పరవళ్లు తొక్కించడంలో రోల్‌ మోడల్‌గా కాలనీ నివాసితులు నిలిచారనడంలో ఎలాంటి సందేహం లేదు. కాలనీ అసోసియేషన్‌ ప్రత్యేకంగా ఈ పార్కుపై శ్రద్ధ పెట్టి ప్రతి మొక్కనూ కాపాడుకుంటూ వస్తోంది.

అరుదైన వృక్ష సందపకు కేరాఫ్‌..

ఈ పార్కును సందర్శిస్తే..కన్నులకు మాత్రమే కాదు..శ్రావ్యమైన కోయిలల రాగాలతో వీనుల విందు..అన్నింటికీ మించి నాసికానికి సువాసనల పసందు..ఒక్కమాటలో చెప్పాలంటే అది బృందావనమా? అన్న సందేహం కలగకమానదు. అందమైన పూల మొక్కలతో పాటు అరుదైన వృక్ష జాతులు ఈ పార్కులో తారసపడుతుంటాయి. మామిడి, తులసీ, నందివర్ధన, మారేడు, ఉసిరి, అశోక, సన్నజాజి, అరటి వంటి మొక్కలు, చెట్లతో పాటు అరుదైన జాతులైన అశ్వగంధ, గంధం, రాధా మాధవి వంటి ఎన్నో రకాల మొక్కలు ఈ పార్కులో సువాసనలు వెదజల్లుతుంటాయి. రంగురంగుల సీతాకోక చిలుకలు, పచ్చని చిలుకలు..ఇలా మదిని మరిపించే దృశ్యాలతో ఈ పార్కు అలరారుతోంది.





కనువిందు చేస్తున్న మోడల్‌ కాలనీ పార్కు అందాలు..





పార్కులో ఇంకుడుగుంత...

ప్రశాంతతకు ఆలవాలం..

మోడల్‌కాలనీ పార్కు ప్రశాంతతకు ఆలవాలంగా నిలుస్తోందనే చెప్పాలి. విరబూసిన పుష్పాలు..పచ్చని బయళ్లు కనువిందు చేస్తుండగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్లు, సందర్శకులు మైమరిచిపోతుంటారు. పిల్లలు, పెద్దలు, వయోధికులు, మహిళలు..ఇలా అన్ని వర్గాల వారు కాసేపు ఇక్కడ సేదదీరి ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదిస్తుంటారు. ఇందుకోసం అక్కడక్కడ కూర్చొనేందుకు బెంచీలను ఏర్పాటుచేశారు. ఇక కార్తీక మాసం వచ్చిందంటే కాలనీ మొత్తం ఈ పార్కు అందాల నడుమ వనభోజనాలతో సందడి చేయడం పరిపాటి.

నిర్వహణ స్ఫూర్తిదాయకం..

చెట్ల ద్వారా వచ్చే వ్యర్థాలు బయటకు తరలించకుండా ఒక పెద్ద గొయ్యిలో వేసి బయో గ్యాస్‌ ఉత్పత్తి చేసుకునేలా ఏర్పాట్లుచేశారు. వర్షపు నీరు అక్కడికక్కడే ఇంకేవిధంగా పలుచోట్ల ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టారు. ఈ పార్కు నిర్వహణకు గాను 2022లో నిర్వహించిన గార్డెన్‌ ఫెస్టివల్‌లో ఈ పార్కుకు ప్రథమ బహుమతి లభించింది.

అందరి కృషితో..

కాలనీ నివాసితులు, ప్రజాప్రతినిధులు, అధికారుల కృషితో పార్కు ఇంతటి అందంగా తీర్చిదిద్దబడింది. గతంలో అనేకమార్లు అధికారులు ఈ పార్కును విజిట్‌ చేసి ముగ్ధులయ్యారు. ఈ పార్కు నిర్వహణ మాదిరిగా అన్ని పార్కులను చేయాలని కూడా నిర్ణయించారు. తమ పార్కు నిర్వహణకు కితాబివ్వడం తమకెంతో ఆనందంగా ఉంది.

-జేఎస్‌టీ శాయి, మోడల్‌కాలనీ ఉపాధ్యక్షుడు

‘స్వచ్ఛత’ నిరంతర ప్రక్రియ : ఎమ్మెల్యే శ్రీగణేశ్‌

కంటోన్మెంట్‌: ‘పరిసరాల పరిశుభ్రత’ను ఓ ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా నిరంతరాయంగా కొనసాగించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. కంటోన్మెంట్‌ బోర్డు ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని రామన్నకుంట పరిసరాల్లో చేపట్టిన ‘స్వచ్ఛత హీ సేవా’ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్‌ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను మొక్కుబడిగా చేపట్టడంతో వదిలేయకుండా ప్రతి బస్తీ, కాలనీల్లో నిరంతరం కొనసాగించాలన్నారు. కంటోన్మెంట్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో బోర్డు సానిటేషన్‌ సిబ్బందికి ప్రజల సహకారం కూడా ఉండాలన్నారు. కంటోన్మెంట్‌ ప్రాంతాలు పచ్చదనానికి ప్రతీకలా కొనసాగుతున్నాయని డిఫెన్స్‌ ఎస్టేట్స్‌ సదరన్‌ కమాండ్‌ డైరెక్టర్‌ అమోల్‌ బి జగదత్‌ అన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు విజయవంతం అవుతాయని బోర్డు సీఈఓ మధుకర్‌ నాయక్‌ అన్నారు. కార్యక్రమంలో బోర్డు జాయింట్‌ సీఈఓ పల్లవి విజయ్‌వన్షీ, హెల్త్‌ సూపరింటెండెంట్‌ దేవెందర్‌, సానిటరీ సూపరింటెండెంట్‌ మహేందర్‌, బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌, కాంగ్రెస్‌ నేతలు ముప్పిడి మధుకర్‌, బాల్‌ రాజ్‌ యాదవ్‌, ప్రవీణ్‌ రెడ్డి, బల్వంత్‌ రెడ్డి, శరత్‌ , తరుణ్‌, పవిత్రన్‌, స్వరూప ,భాగ్య , భారతి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన విద్యార్థులు

పంజగుట్ట: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమాజిగూడలోని రూట్స్‌ కాలేజీ ఆఫ్‌ హోటల్‌ మేనేజ్‌మెంట్‌ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు నెక్లెస్‌ రోడ్డులో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను రోడ్లపై పడెయ్య డం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ నిఖిల్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీటీజీడీఏ గాంధీ యూనిట్‌ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

గాంధీఆస్పత్రి : తెలంగాణ టీచింగ్‌ గవర్నమెంట్‌ డాక్టర్స్‌ అసోషియేషన్‌ (టీటీజీడీఏ) గాంధీ యూనిట్‌ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం గాంధీ యూనిట్‌ అధ్యక్షుడిగా డాక్టర్‌ బీ కిరణ్‌, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ ఎస్‌ మదన్‌మోహన్‌, ఉపాధ్యక్షులు హర్షిత, విక్రమ్‌, అనీల్‌, ఉపకార్యదర్శులు అర్జున్‌, త్రిభువన్‌కుమార్‌, నాగరాజగౌడ్‌, కోశాధికారిగా డాక్టర్‌ డీ రమేష్‌, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్‌, సయ్యద్‌ ఇబ్రహీంజుబారీ, సైదాఅస్పియా తమ్‌కీన్‌, నిరంజన్‌, సందీప్‌, సదానందం, రాంబాబు, దినేష్‌, శ్రేయసంతోషీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ బోధన వైద్యుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ ప్రతినిధులు తెలిపారు. నేటి నుంచి రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది.

వెంటాడి పట్టుకున్నారు

- నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో విద్యార్థిని ఢీకొట్టిన కారు
- పరారీకి సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ యత్నం

రాంగోపాల్‌పేట్‌: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా కారు నడుపుతున్న ఓ సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ విద్యార్థిని ఢీకొట్టాడు. కారు ఆపేందుకు యత్నించిన కానిస్టేబుల్‌ కాలిపై కారును ఎక్కించి పరారయ్యాడు. అతడిని వెంటాడిన ట్రాఫిక్‌ పోలీసులు కొద్ది దూరంలోనే పట్టుకున్నారు. వివరాల్లో వెళితే చైతన్యపురికి చెందిన రాహుల్‌ గూగుల్‌లో సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం అతను ఆర్పీరోడ్‌లో సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ కారు డ్రైవింగ్‌ చేస్తూ ప్యాట్నీ వైపు వెళుతున్నాడు. ప్యాట్నీ సర్కిల్‌ వద్ద రోడ్డు దాటుతున్న ఓ విద్యార్థినికి ఢీకొట్టడంతో స్వల్ప గాయాలయ్యాయి. అక్కడే విధి నిర్వహణలో ఉన్న మహంకాళి ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీధర్‌రాజు గమనించి కారును ఆపేందుకు యత్నించాడు. మరింత వేగంతో యూ టర్న్‌ చేసి కానిస్టేబుల్‌ కాలుపై కారును ఎక్కించి పరారయ్యాడు. గాస్మండి సిగ్నల్‌ వద్ద మరో కారును ఢీకొట్టాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకోగా మతిస్థిమితం లేని వ్యక్తిలా నటిస్తూ కొద్దిసేపు ఎలాంటి సమాచారం చెప్పకుండా ముప్పు తిప్పలు పెట్టారు. అటు తర్వాత కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత అతనిపై నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ కింద కేసు నమోదు చేసి చలాన్‌ విధించినట్లు ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ఉపశంకర్‌ తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్‌



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం.. వృత్తంలో నిందితులు

చిలకలగూడ : ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్‌ చేసిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ అనుదీప్‌, ఎస్‌ఐ సబిత తెలిపిన మేరకు.. ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో సీతాఫల్‌మండి వాటర్‌ ట్యాంకు గల్లీలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న వారాసిగూడ మేడిబావికి చెందిన ముత్యాల సుష్మా (34) చిలకలగూడలో తాళంచెవుల తయారీ షాపు నిర్వహిస్తున్న మహ్మద్‌నయిమ్‌ (37) యాక్టివా వాహనం (టీఎస్‌10ఈఆర్‌ 7824)పై అటుగా వచ్చారు. డాక్యుమెంట్లు చూపించమని అడిగితే పొంతన లేని సమాధానాలు చెప్పి పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వాహన డిక్కీ తెరిచి చూడగా గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. ఎస్‌ఐ ఆంజనేయులు ఫిర్యాదు మేరకు నిందితులు సుష్మా, మహ్మద్‌నయిమ్‌లపై ఎన్‌డీపీఎస్‌ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామని, నిందితుల నుంచి 260 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సబిత తెలిపారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా రూ.43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్‌ 65, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 20, క్యారెట్‌ 40, దొండ 28, గుందుబీన్స్‌ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 20, దోసకాయ 19, బీట్‌రూట్‌ 28, ఉల్లిగడ్డ 50, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, ముల్లంగి గడ్డ 45, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 5–6, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పనులు పరిశీలించిన కార్పొరేటర్‌

చిలకలగూడ :సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్‌ సామల హేమ శుక్రవారం పరిశీలించారు. డివిజన్‌ పరిధిలోని శ్రీనివాసనగర్‌ సవరాల బస్తీ, మైలార్‌గడ్డ, బీదలబస్తీ, ఏకేనంబర్‌గల్లీలలో లక్షలాది రూపాయల వ్యయంతో అంతర్గత రహదారులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

సీనియర్‌ జర్నలిస్టు నారాయణ మృతి బాధాకరం



నారాయణ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: సీనియర్‌ జర్నలిస్టు నారాయణ మృతి చాలా బాధాకరమని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ విచారం వ్యక్తంచేశారు. శుక్రవారం మహాప్రస్థానంలో నిర్వహించిన అంత్యక్రియలకు హాజరైన ఆయన నారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

చిలకలగూడ ఠాణా ఎస్‌ఐలు బదిలీ

చిలకలగూడ : చిలకలగూడ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్‌ఐలకు బదిలీ అయింది. అడ్మిన్‌ ఎస్‌ఐ బాలరాజును సైఫాబాద్‌ కు, ఎస్‌ఐ కిషోర్‌ను లాలాగూడకు బదిలీ చేస్తు పోలీస్‌ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన ‘సర్వే’



కంటోన్మెంట్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వచ్చిందని, రానున్న రోజుల్లో మరింత బలోపేతం అవుతుందని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ను శాలువాతో సత్కరించారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్‌: బేగంపేట్‌, లోధా, హెచ్‌పీఎస్‌, మైత్రీవనం, ఎయిర్‌పోర్ట్‌, ఐడీపీఎల్‌, గ్రీన్‌ల్యాండ్స్‌, కుందన్‌బాగ్‌, సంజీవయ్యపార్కు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్‌ ఫీడర్‌ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్‌ ఏడీఈ కిషోర్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్‌, వెల్‌నెస్‌ హాస్పటల్‌ వెనుక ప్రాంతం, అభిరుచి హోటల్‌, డీఎస్‌ఎం కాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్‌ మెయిన్‌ రోడ్డు, సుభాష్‌నగర్‌, ఎస్‌ఆర్‌టీ పార్ట్‌, టీవీఎస్‌ షోరూం లేన్‌, మెథడిస్ట్‌ చర్చి లేన్‌, డి-మార్ట్‌ ఎదురు ప్రాంతం, గురుమూర్తిలేన్‌, తాతాచారికాలనీ, ఆర్‌బీఐక్వార్టర్స్‌, బొంబే హల్వా కాంపౌండ్‌ ప్రాంతాల్లో
- ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు సనత్‌నగర్‌ ఇండస్ట్రీయల్‌ ఏరియా, డి-మార్ట్‌ ఏరియా, టయోటా షోరూం లేన్‌, స్కోడా షోరూంలేన్‌, జెన్‌ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రా బ్యాంక్‌ లేన్‌, సోనాబాయి టెంపుల్‌, సత్యం థియేటర్‌, స్పెన్సర్‌ బిల్డింగ్‌, ప్లే గ్రౌండ్‌ ఏరియా, శీష్‌మహల్‌ థియేటర్‌ ఏరియా ప్రాంతాల్లో
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీన్‌పార్కు హోటల్‌, డాక్టర్‌ రెడ్డీస్‌ ల్యాబ్‌ ఏరియా, పేస్‌ హాస్పటల్‌, గురుమూర్తి లేన్‌, మోతీలాల్‌నెహ్రూనగర్‌, ఎయిర్‌కార్గో, శ్యాంలాల్‌బిల్డింగ్స్‌, మూసాపేట హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్‌ ఏరియా, శ్రీరాములు థియేటర్‌ ఏరియా, అశ్విని హెయిర్‌ ఆయిల్‌ లేన్‌ ప్రాంతాల్లో
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సనత్‌నగర్‌ ఇండస్ట్రీయల్‌ ఏరియా, అల్లావుద్దీన్‌కోఠి, లిక్కర్‌ కంపెనీ ప్రాంతాల్లో
- మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు శ్రీనివాస టవర్స్‌, అమోఘ ప్లాజా, మేటాస్‌, బ్లూమూన్‌ హోటల్‌, మనీల్యాండ్‌ చైనా, ఐసీఐసీఐ బ్యాంక్‌ లేన్‌, భగవంతాపూర్‌, గగన్‌విహార్‌ కాలనీ, షేర్‌ఖాన్‌బస్తీ ప్రాంతాల్లో
- మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు స్వప్న నర్సింగ్‌ హోం, నిషాంత్‌ బాగ్‌, కీర్తిలాల్‌ జ్యువెలర్స్‌, బాబూఖాన్‌ మాల్‌, అమృతమాల్‌, కామత్‌లింగాపూర్‌, ప్రకాష్‌నగర్‌ ఎక్స్‌టెన్షన్‌, ప్రకాష్‌నగర్‌ వాటర్‌ ట్యాంక్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ కోత అమలులో ఉంటుందన్నారు.

కొండా లక్ష్మణ్‌ బాపూజీ సేవలు చిరస్మరణీయం



కొండా లక్ష్మణ్‌ బాపూజీకి నివాళులు అర్పిస్తున్న పీసీబీ సభ్య కార్యదర్శి రవి తదితరులు

సనత్‌నగర్‌: స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కొండా లక్ష్మణ్‌ బాపూజీ అని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి అన్నారు. కొండా లక్ష్మణ్‌ బాపూజీ జయంతి సందర్భంగా పీసీబీ కార్యాలయంలో శుక్రవారం ఆయనకు నివాళులు అర్పించారు. హాజరైన సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ తొలి, మలితరం తెలంగాణ ఉద్యమాల్లో ముందుండి నాటి తెలంగాణ విముక్తి ఉద్యమానికి కొండా లక్ష్మణ్‌ బాపూజీ నాయకత్వం వహించారన్నారు. తెలంగాణ విమోచనోద్యమంలో పోరాడి పౌర హక్కులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో నిర్బంధించిన నాయకులకు ఉచిత న్యాయ సహాయం చేసి కుట్ర కేసులను వాదించి గెలిచారన్నారు. కార్యక్రమంలో బోర్డుసభ్యులు సత్యనారాయణరెడ్డి, పీసీబీ అధికారులు పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కొండా లక్ష్మణ్‌ బాపూజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఓయూ జేఏసీ చైర్మన్‌ రాజునేత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు ఆర్‌.కృష్ణయ్య ముఖ్యఅతిగా హాజరై బాపూజీ చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్లు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో రాము, విక్రం, నాగరాజు, మహేష్‌, మధు, బీసీ నాయకులు బొమ్మ నరేందర్‌,మంద వెంకటస్వామి,వల్లపు క్రిష్ణమూర్తి, మురళి, అనురాధ, మధు, శ్రీకాంత్‌, చాణిక్య తదితరులు పాల్గొన్నారు.



బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్‌.కృష్ణయ్య

తార్నాకలో డిప్యూటీ మేయర్‌ నివాళి

లాలాపేట: స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తుది శ్వాస వరకు పోరాడిన మహానాయకుడు కొండా లక్ష్మణ్‌ బాపూజీ అని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తార్నాకలోని తన కార్యాలయంలో కొండా లక్ష్మణ్‌ బాపూజీ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్‌ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళ్లు అర్పించారు.



తార్నాకలో ఆదార్య కొండా లక్ష్మణ్‌ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్‌

వరద బాధిత చిన్నారులకు ఎన్‌ఎస్‌కేకే సాయం



రెడ్‌క్రాస్‌ సొసైటీకి పుస్తకాలు అందజేస్తున్న ఎన్‌ఎస్‌కేకే యాజమాన్యం..

సనత్‌నగర్‌: ఇటీవల వరదలతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు చేయూతనివ్వాలని ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ ఇచ్చిన పిలుపు మేరకు బాలానగర్‌ ఎన్‌ఎస్‌కేకే హైస్కూల్‌ యాజమాన్యం స్పందించింది. వరద బాధితులకు అండగా నిలుద్దామని ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ హైదరాబాద్‌ జిల్లా శాఖ చైర్మన్‌ మామిడి భీంరెడ్డి, యూత్‌ కన్వీనర్‌ మణిదీప్‌లు ఇటీవల పిలుపునిచ్చారు. ఆ మేరకు ఫతేనగర్‌ కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్‌ చొరవతో ఎన్‌ఎస్‌కేకే స్కూల్‌ యాజమాన్యం స్పందించి వరద బాధిత చిన్నారులకోసం రూ.5000 పుస్తకాలు, స్టేషనరీని అందజేశారు. గత కొన్ని రోజులుగా వరద బాధితుల సహాయార్థం రెడ్‌క్రాస్‌ సొసైటీ తరుపున పుస్తకాలు, స్టేషనరీని సేకరిస్తున్నట్లు మణిదీప్‌ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్‌ సునీధ, సెక్రటరీ బాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

బన్సీలాల్‌పేట్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. బీజేపీ సీనియర్‌ నాయకులు అంగముత్తు శ్రీనివాస్‌ ఐడిహెచ్‌ కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల్లో అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అనేక మంది పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌: డివిజన్‌లోని ప్రతీ పోలింగ్‌ బూత్‌లో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్‌ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బౌద్ధనగర్‌ డివిజన్‌లోని 179 పోలింగ్‌ బూత్‌ పరిధిలో పర్యటించి సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలోబూత్‌ కోడరినేటర్లు సుబ్బారావు, విశ్వనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.





సభ్యత్వ నమోదు చేస్తున్న బిజేపీ నాయకులు